నిరంతర నాణ్యమైన విద్యుత్



గాజులకొల్లివలసలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్



- రూ.1.60 కోట్లతో గాజులకొల్లివలసలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యుత్ వినియోగదారులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలస గ్రామం సమీపంలో గల జగనన్న కాలనీ లేవుట్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో నిరంతర వెలుగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యుత్‌శాఖలో నూతనంగా ఆవిష్కరించిన విధివిధానాలకు అనుగుణంగా, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా విద్యుత్‌శాఖ నుంచి నిరంతర నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడం కోసం నిర్మించారు. పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో రూ.1.60 కోట్ల వ్యయంతో 33 కేవీ/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావించినా పూర్తిచేయలేదు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో, శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో ఈ నిర్మాణం పూర్తి చేశారు. దాదాపు 20 గ్రామాలకు రెండు మెగా వాట్ల విద్యుత్‌ను నిరంతరం అందించేందుకు వీలు కలుగుతుంది. జగనన్న కాలనీకి పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు నిరంతర విద్యుత్‌కు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామాల్లో ముఖ్యంగా లోవోల్టేజీ సమస్యతోపాటు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



అంబావల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రజలకు పిలుపునిచ్చారు. అంబావిల్లి, రెల్లివలస గ్రామాల్లో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను శత శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒక వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వలంటీర్లతో పారదర్శకంగా పథకాలు, పౌరసేవలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. సీఎం జగన్ సుపరిపాలన అందించారన్నారు. కొవిడ్ కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలు కొనసాగించామన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చామన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షతో పల్లెల్లోనే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు సీఎం జగన్ పెంచి పేదల పక్షపాతిగా గుర్తింపు పొందారని కొనియాడారు. నాడు–నేడు ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఎంపీటీసీ లుకలాపు సావిత్రి, నాయకులు పోదిలాపు శ్రీరాములు, ఎల్.ప్రసాదరావు, వంగపల్లి చిన్నారావు, శిమ్మ పాపయ్య, మీసాల శంకరరావు, వి.బాలరాజు, నక్క ఆనంద తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 పరీక్ష



నరసన్నపేట: జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల వద్ద వేచిఉన్న అభ్యర్థులు



నరసన్నపేట: అభ్యర్థుల హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న పోలీసులు



నరసన్నపేట: స్రైబ్ సహకారంతో పరీక్ష రాసేందుకు వచ్చిన లోల్ల జ్యోత్స్న

నరసన్నపేట: మండల కేంద్రంలో గ్రూప్–2 ప్రిలిమనరీ రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. తహసీల్దార్ పి.కనకారావు, ఎస్‌ఐ వి.అశోక్ బాబు పర్యవేక్షణలో నరసన్నపేటలోని 8 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 1940 మంది అభ్యర్థులను కేటాయించగా.. దీంట్లో 268 మంది హాజరుకాలేదు. జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో 41 మంది, పద్మావతి డిగ్రీ కళాశాలలో 28 మంది, డీఆర్ఎస్ కళాశాలలో 26 మంది, శర్వాణీ స్కూల్‌లో 31 మంది, నారాయణ స్కూల్‌లో 21 మంది, పద్మావతి జూనియర్ కళాశాలలో 26 మంది, జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో 48 మంది, ఎల్‌వీఆర్ కళాశాలలో 47 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థుల హడావుడి మొదలైంది. పోలీసులు అన్ని కేంద్రాల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేశారు. జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో లోల్ల జ్యోత్స్న స్రైబ్ సాయంతో పరీక్ష రాశారు. ఆమదాలవలసకు చెందిన డబ్బీరు సౌజన్య తన 28 రోజుల చిన్నారిని సమీప బంధువు వద్ద విడిచి పెట్టి డీఆర్ఎస్ కళాశాలలో పరీక్ష రాశారు.

పోలాకి: మండలంలోని గ్రూప్–2 పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయటంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్‌లో 248 మంది, విశ్వశాంతి హైస్కూల్‌లో 169 మంది, శారద స్కూల్‌లో 161 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, 122 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.

కొత్తూరు: మండల కేంద్రంలోని రెండు కేంద్రాల్లో ఆదివారం గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 300 మంది అభ్యర్థులకు 165 మంది, వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో 300 మందికి 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు కేంద్రాలకు లైజన్ ఆఫీసర్లుగా ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఎం.వి.ప్రసాదరావు వ్యవహరించారు. పోలీస్ బందో బస్త్ మధ్య పరీక్షలు జరిగాయి.



కొత్తూరు: పరీక్ష పేర్ల బండిల్స్‌ను పరిశీలిస్తున్న లైజన్ ఆఫీసర్లు



పోలాకి: ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం వద్ద బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీసులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని టి.కె.పురం పంచాయతీలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ప్రధాన వీధితోపాటు పలు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చెపట్టి చెత్తను తొలగించారు. చెత్తను ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలిస్తామని పంచాయతీ అధికారి పద్మజ తెలిపారు.



మురుగును తొలగిస్తున్న దృశ్యం

స్పందించిన దాతలు



రూ.42,500 నగదు అందజేస్తున్న దాతలు

పొందూరు: ఈ నెల 5న సాక్షిలో ప్రచురించిన 'తల్లి దండ్రులు దూరం భవిత భారం' కథనానికి దాతలు స్పందిస్తున్నారు. మలకాంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు పొందూరు పట్టుశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం రూ.42,500 అందజేశారు. దాతలు ఇప్పటివరకు రూ.3.43 లక్షలు అందించారు. మరింత మంది దాతలు సహకరించాలని చిన్నారులు (ఫోన్ పే నంబర్ 99124 74529) కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్

వత్సవలస జాతరలో విషాదం

- అనారోగ్యంతో వ్యక్తి మృతి

గార: వత్సవలస తొలివారం జాతర కోసం వచ్చిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సరుబుజ్జిలి మండలం పాలవలస గ్రామానికి చెందిన అల్లాడ సింహాచలం (80) కుటుంబ సభ్యులతో కలసి వత్సవలస జాతరకు శనివారం రాత్రి వచ్చారు. రాత్రి అక్కడే పడుకొని అమ్మవారి దర్శన అనంతరం ఆదివారం మధ్యాహ్నం వంటలు పూర్తయ్యాక భోజన సమయంలో వడ్డిస్తూ కుప్పకూలిపోయాడు. వైద్య సేవలు అందేలోపు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్దగల కొత్తకోట పీఏసీఎస్ భవనాన్ని సోమవారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రతీ విద్యార్థికి ఇంటర్మీడియెట్ దశ కీలకం

సరుబుజ్జిలి: విద్యార్థులు మంచి మార్గంలో పయనించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని వెంకటసాయి విద్యా సంస్థల కరస్పాండెంట్ కూన జగన్నాథం అన్నారు. కళాశాల ఆవరణలో ఆదివారం ఇంటర్ విద్యార్థులు ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



జలుమూరు: శ్రీముఖలింగం ఆలయానికి ఆనుకుని ఉన్న వీరాంజనేయ స్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా రాజమండ్రికి చెందిన భక్తులు భాస్కర భట్ల లక్ష్మణకుమార్, పుష్పలత దంపతులు లక్ష తమలపాకులతో ఆదివారం అర్చన చేశారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం పట్టణ సమీపంలోని శ్రీపురం గ్రామానికి చెందిన మహిళల కోలాటం ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

పాతపట్నం: రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండాస్ సంస్థ ఆధ్వర్యంలో నియోజవకర్గ స్థాయి ప్రతిభా పరీక్ష ఆదివారం నిర్వహించారు. హెచ్‌ఎం నల్ల కుమారస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించి, పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నారన్నారు. 120 మంది విద్యార్థులు హాజరజయ్యారన్నారు. పరీక్ష ప్రశ్నపత్రాన్ని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, నిర్వాహకులు ఆవిష్కరించారు. మనోహార్ ప్రథమ స్థానం (రొంపివలస హైస్కూల్), ద్వితీయ స్థానంలో ధనుష్ (రొంపివలస), ప్రత్యూష (కొరసవాడ), తృతీయ స్థానంలో జయంత్ కుమార్ (గులుమూరు), సయ్యద్ సల్మా (పాతపట్నం) నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని సంస్థ నిర్వాహకులు హేమసుందర్, రమణ, ఈశ్వరరావు తెలిపారు. రేగెటి మధుసూదనరావు, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన

సరుబుజ్జిలి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం స్పష్టంచేశారు. మండలంలోని పురుషోత్తపురం పంచాయతీ పరిధిలోని సీతారామ్ నగర్‌కాలనీ, అలమాజీపేట, ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆదివారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉండి పథకాలు అందనివారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, స్థానిక పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువతలో భక్తిభావం పెరగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: యువతలో భక్తిభావం పెరగాలని, తద్వారా సమాజంలో ప్రశాతమైన వాతారణం ఏర్పడుతుందని నరసన్నపటే ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కింజరాపువానిపేటలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక భావాలు కలిగినవారి సంఖ్య ప్రస్తుత సమాజంలో బాగా తగ్గిపోవటంతోపాటు, భక్తిని కూడా ఆడంబరంగా చూపించే సంస్కృతి పెరిగిపోయిందన్నారు. అటువంటివాటి నుంచి బయటపడాలన్నారు. అనంతరం నుసరాం దుర్గాదేవి జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని చిన్నకృష్ణాపురం మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1988–89లో ఏడో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. గురువుల పాదాలు కడిగి ఆశీర్వచనాలు తీసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ స్నేహితులందరూ సరదాగా గడిపారు.

సమాజానికి మరింత మేలు చేసే పనులు చేపట్టాలని ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులకు గురువులు సూచించారు. ఉపాధ్యాయులు తవిటమ్మ, జగన్నాథ రావు, ప్రసాదరావు, సీతారాం, శివరామ కృష్ణ, కుశరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలి

సారవకోట: ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని అడవలోని శివానంద ఆశ్రమ పీఠాధిపతి ఎ.వినయ్‌కుమార్ సూచించారు. మండలంలోని బుడితిలో దివ్యజీవన సమాజం, ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. భగవద్గీతతో మనం నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. నరసింహ స్వామి, అల్లు రామయ్య, రామదాసు, సోమేశ్వరరావు తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. అనంతరం నిక్కు అప్పారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నారాయణ సేవా కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు జాడ మోహన్‌రావు, మెండ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట



పూజలు అందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో గల మార్కెట్ వీధిలో ఉన్న ఉమాసోమేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖద్వారం ప్రారంభోత్సవం పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ఎం.లోకేశ్వరరావు, కొరసవాడ, కాగువాడ, బూరగాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్యవర్గం ఎన్నిక



దివ్యాంగుల కార్యవర్గం ఎంపిక చేస్తున్న వేణుగోపాల్

సారవకోట: దివ్యాంగుల మండల కార్యవర్గాన్ని మండల కేంద్రంలో ఎంపిక చేసినట్లు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.వేణుగోపాల్ తెలిపారు. అధ్యక్షుడిగా బండి గిరి, సెక్రటరీగా పాటన ఉషారాణి, కమిటీ సభ్యుడిగా జాడ నూకరాజును ఎంపిక చేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పక్కాగా అమలు చేయాలని, ప్రవేట్ సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

సందడిగా బల్ల పండగ



స్వర్ణమణి అమ్మవారి ఆలయానికి ఘటాలతో వెళ్తున్న భక్తులు

సారవకోట: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో బల్ల పండగను ఆదివారం సందడిగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వర్ణమణి అమ్మవారికి భక్తులు ఘటాలను తీసుకువెళ్లి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పాస్ పుస్తకాల అందజేత



పాస్ పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లి గూడలో ఇటీవల రీసర్వే చేసిన భూములకు సంబంధించి గిరిజనులకు సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం ఆదివారం పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడకు వలస వచ్చిన గిరిజనులకు గత ప్రభుత్వాలు ఇంతవరకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న భూ సమస్యలకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిష్కరించారన్నారు. స్పీకర్ తమ్మినేని సీతారాం కృషితో గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలతోపాటు ప్రభుత్వమే ఇళ్లు కూడా నిర్మాణం చేపట్టి అందజేయడం జరుగుతుందన్నారు. వీఆర్వో ఉమామహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

కొత్తూరు: మండలంలోని పానుటూరు గ్రామంలో చంద్రశేఖర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పతివాడ లక్ష్మీనారాయణ, కాంతమ్మ దంపతుల జ్ఞాపకార్థం పునఃప్రతిష్ట కార్యక్రమం నిర్వహించినట్లు రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ పి.రామరాజు తెలిపారు.

డీటీఎఫ్ మండల కమిటీల ఏర్పాటు

పొందూరు: స్థానిక శ్రీరామా డిగ్రీ కళాశాలలో ఆదివారం డీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. పొందూరు, జి.సిగడాం, సంతకవిటి, లావేరు మండలాలకు కమిటీలు ఏర్పాటు చేశారు. పొందూరు మండలం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బలివాడ వెంకటేశ్వర్లు, గురుగుబెల్లి భాస్కరరావు, జి.సిగడాం మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శిల్లా భాస్కరరావు, జి.శ్రీరామదత్తులు, లావేరు మండలానికి అధ్యక్షుడిగా జి.బాలకృష్ణను నియమించారు. డీటీఎఫ్ కార్యకర్తలు జి.రాజశేఖర్, జి.గోపాలరావు, జి.రామారావు, జి.వెంకటరావు, బి.గజపతిరావు, బి.వి.రమణ పాల్గొన్నారు.